నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 7 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేయాలి


బహుమతులు అందిస్తున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి

రెబ్బెన, మార్చి 6: బెల్లంపల్లి ఏరియాకు సింగరేణి సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు అధిగమించేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి స్పష్టం చేసారు. బెల్లంపల్లి ఏరియా లోని ఖైర్‌గూడ ఓసీపీలో గురువారం ఫిబ్రవరిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన షావల్, డంపర్ ఆపరేటర్లతో పాటు ఇతర ఉద్యోగులు మొత్తం 13మందికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా జీఎం బహుమతులు అందించిన అనంతరం మాట్లాడుతూ ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీ గనికి ఈ ఆర్థిక సంవత్సరంలో సంస్థ నిర్దేశించిన 37.5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ తన వంతుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి శంకర్, ప్రాజెక్టు ఇంజినీర్ వీరన్న, సేఫ్టీ అఫీసర్ నారాయణ, డీవైపీఎం వేణు, ఏఐటీయూసీ నాయకులు దివాకర్, ఓదెలు ఉన్నారు.

## మహిళలకు క్రికెట్ పోటీలు


క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ సతీమణి మాలతి

సీసీసీ నస్పూర్, మార్చి 6 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి మహిళలకు గురువారం సాయంత్రం క్రికెట్ పోటీలు నిర్వహించారు. సీసీసీ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను డైరెక్టర్(ఆపరేషన్స్) సూర్యనారాయణ సతీమణి మాలతి ప్రారంభించారు. కొద్దిసేపు క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు ఉమారాణి, క్లబ్ కార్యదర్శి తిరుపతి, స్పోర్ట్స్ కార్యదర్శి శ్రీధర్, లేడీస్ క్లబ్ కార్యదర్శి దివ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.



తలమడుగు మండలంలోని కజ్జర్ల గ్రామంలో నీరు లేక జొన్న పంట ఎండిపోవడంతో పశువులను మేపుతున్న రైతులు

కాంగ్రెస్ తెచ్చిన కరువు

# మేతకు జొన్న

### సాగునీరు లేక పంట వట్టిపోతుండడంతో పశువులను మేపుతున్న రైతులు




- కండ్ల ముందే ఎండిపోతుండడంతో కన్నీరు పెడుతున్న అన్నదాతలు
- అడుగంటిన భూగర్భ జలాలు.. బోర్లు వేసినా నీరు రాని వైనం..
- కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో చివరి ఆయకట్టుకు అందని నీరు
- పంటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు

ఆదిలాబాద్, మార్చి 6(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా యాసంగిలో సాగైన పంటలు నీరు అందకపోవడంతో వట్టిపోతున్నాయి. జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో జొన్న, శెనగ, పల్లి, గోధుమ పంటలు సాగయ్యాయి. అధికంగా 70 వేల ఎకరాల్లో జొన్న సాగైంది. ప్రస్తుతం జొన్న మంచి ఎదుగుదల దశలో ఉంది. కంకి వచ్చి విత్తులు రావాల్సి ఉండగా నీరు అవసరం అవుతున్నది. భూగర్భ జలాలు అడుగంటడం, పంటను రక్షించుకునేందుకు బోర్లు వేసినా నీరు పడకపోవడంతో నష్టపోవాల్సి వస్తున్నది. చెరువుల నుంచి పంటలకు నీరు అందించాల్సిన కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో నీరంతా వృథాగా పోతున్నది. దీంతో చేసేదేమీ లేక తమ చేలలోనే పశువులను వదులుతున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి వేసిన పంటలకు సాగునీరు అందక తమ కండ్ల ముందే ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పశువులను మేపుతున్నామని రైతులు అంటున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

### కాలువల ద్వారా నీరందించాలి..

*నేను ఆరెకరాల్లో జొన్న సాగు చేశా. భూగర్భ జలాలను ఇంకిపోవడంతో బోరు సరిగా పోయడం లేదు. ఏటా యాసంగిలో ఆరెకరాలకు 12 నాజళ్ల ద్వారా నీటిని అందిస్తా. ఇప్పుడు తొమ్మిది నాజళ్లు పెట్టినా నీరు పోయడం లేదు. బోరు ఎప్పుడు ఆగిపోతుందో తెలియని దుస్థితి. కంకి దశలో ఉన్న జొన్నకు మరో రెండు తడులు అవసరమవుతాయి. కానీ.. పూర్తిస్థాయిలో నీరు అందించే పరిస్థితి లేదు. మరో వారం రోజుల వరకు బోర్‌లో నీళ్లు ఉండే అవకాశాలున్నాయి. పంట చేతికొస్తుందనే నమ్మకం లేదు. కజ్జర్ల చెరువు కాలువ ద్వారా నీరు వచ్చే అవకాశం ఉన్నా.. అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో నీరు రావడం లేదు. అధికారులు స్పందించి కాలువ ద్వారా నీరు అందేలా చర్యలు తీసుకోవాలి.*

**- నవీన్, రైతు, కజ్జర్ల, తలమడుగు మండలం**

### రూ.1.25 లక్షలు నష్టపోయే ప్రమాదం ఉంది..

*నేను ఆరెకరాల్లో జొన్న సాగు చేశా. సాగు కోసం రూ.1.25 లక్షల అప్పు చేశా. ప్రస్తుతం జొన్న కంకి దశలో ఉంది. మరో రెండు తడుల నీరిస్తే దిగుబడి బాగా వస్తుంది. నేను నాకున్న బోరు ద్వారా గతేడాది 12 నాజళ్లతో పుష్కలంగా నీరు అందించి మంచి దిగుబడులు పొందా. ఈ ఏడాది మా గ్రామంలో చాలా మంది రైతుల బోర్లలో నీరు అడుగంటిపోయింది. దీంతో బోర్ల నుంచి నీళ్లు వస్తలేవు. ప్రస్తుతం ఆరు నాజళ్ల ద్వారా నీరు ఇస్తుండగా సరిపోవడం లేదు. బోరు నుంచి నీరు తక్కువగా వస్తుంది. మరో వారం, పది రోజుల్లో బోరు ఎండిపోయే ప్రమాదం ఉంది. దీంతో చేతికొచ్చే పంట నష్టపోయే దుస్థితి నెలకుంది. మా గ్రామంలో చెరువు కాలువ మరమ్మతులు చేస్తే పంటలకు నీరు అందుతుంది.*

**- గుమ్మల నాందేవ్, రైతు, కజ్జర్ల, తలమడుగు మండలం, ఆదిలాబాద్**

# 'పది'లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

లక్షెట్టిపేట, మార్చి 6 : ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని తహసీల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్‌తో కలిసి సందర్శించారు. వంటశాల, భోజనశాల, హాజరు పట్టికలు, పరిసరాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం సకల సౌకర్యాలతో నాణ్యమైన విద్యనందిస్తున్నదన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో చేపడుతున్న 30 పడకల ప్రభుత్వ దవాఖాన పనులను పరిశీలించారు.త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, మున్సిపాలిటీలో ఆస్తి పన్నులను 100 శాతం వసూలు చేసి పురపాలక సంఘ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.

### కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణం పరిశీలన

హాజీపూర్, మార్చి 6 : కేంద్రీయ విద్యాలయంలో మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం గుడిపేటలో కొనసాగుతున్న కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తున్నారని, వీరిని మరింత ప్రోత్సహించి అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా కృషి చేయాలని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటు కోసం తహసీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండేతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. భూ సమస్యలపై వచ్చే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

# ప్రతి మొక్కనూ సంరక్షించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే


మొక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 6 : నర్సరీల్లోని ప్రతి మొక్కనూ సంరక్షించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం ఆసిఫాబాద్ మండలం అంకుశాపూర్ జీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని ఆకస్మికంగా సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ మొక్కల పెంపకంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీటిని అందించాలని తెలిపారు. నర్సరీ నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన గ్రామపంచాయతీ కార్యదర్శి కవితకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

### వేసవి దృష్ట్యా రక్షణకు చర్యలు

వేసవి దృష్ట్యా పని ప్రదేశాల్లో ఉపాధి హామీ కూలీల రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం ఆసిఫాబాద్ మండలం ఎల్లారం శివారులోని వ్యవసాయ చేనులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పనులు చేపట్టే ప్రాంతాల్లో తాగునీరు, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందించాలని, ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని నీడ కల్పించాలన్నారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బానోత్ దత్తారాం, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పట్టుదలతో లక్ష్యాలను సాధించాలి

బాలికలు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని పట్టుదలతో సాధించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన భేటీ బచావో– భేటీ పడావో దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ బాలికలను బతికించుకుందామని, వారిని ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ప్రోత్సహిద్దామన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త శారద, మాస్టర్ ట్రైనర్లు రాజేశ్, సుందిళ్ల రమేశ్, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ట్యాక్స్ వసూళ్ల కోసం 3 ప్రత్యేక బృందాలు


దుకాణానికి తాళం వేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

- మొండి బకాయిదారులపై చర్యలకు రంగం సిద్ధం
- రెడ్ నోటీసులు రెడీ చేస్తున్న అధికారులు

# పన్ను చెల్లించకుంటే ఆస్తులు జప్తే..

మంచిర్యాలటౌన్, మార్చి 6 : ఆస్తి పన్ను చెల్లించని వారి ఆస్తులు జప్తు చేసేందుకు సర్కారు చర్యలకు సిద్ధమైంది. ఈ మేరకు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మూడు ప్రత్యేక బృందాలను నియమించింది. ఒక్కో బృందంలో పది మంది ఉద్యోగులు, సిబ్బందిని నియమించింది. వీరికి ప్రత్యేకంగా వాహనాలు సమకూరుస్తున్నది. వాటికి జప్తు వాహనం అని బోర్డులను తగిలించనున్నారు. పెద్ద మొత్తంలో ఆస్తి పన్ను చెల్లించాల్సిన భవన యజమానులతో పాటు మొండి బకాయిదారులుగా ముద్రపడ్డ వారి ఇండ్లకు ఈ ప్రత్యేక బృందాలు వెళ్లి.. మర్యాదపూర్వకంగా పన్ను చెల్లించాలని కోరుతారు. వీలును బట్టి వారికి కొంత సమయాన్ని ఇస్తున్నారు. గడువులోగా పన్ను చెల్లించకపోతే ఇంట్లోని విలువైన వస్తువులు, పరికరాలను జప్తు చేయనున్నారు. తమ వెంట తీసుకువెళ్లిన వాహనంలో జప్తు చేసిన వస్తువులను ప్రదర్శనగా తీసుకెళ్లనున్నారు. మొండి బకాయిదారుల జాబితాను ఇప్పటికే తయారు చేసుకున్న అధికారులు ముందుగా వారికి రెడ్ నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమయ్యారు.

### రూ.26.28 కోట్ల వసూళ్లే లక్ష్యంగా..

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 45,373 భవనాలుండగా, వాటినుంచి ఈ ఏడాది ఆస్తిపన్ను రూపేణా పాత బకాయిలు కలుపుకొని మొత్తం రూ. 26.28 కోట్లు వసూలు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు 40 శాతం మాత్రమే వసూలు చేశారు. మిగిలిన రూ. 15.67 కోట్లు వసూలు చేసేందుకు ఇంకా 24 రోజులు మాత్రమే గడువు మిగిలి ఉంది. ఈలోగా పూర్తి స్థాయిలో ఆస్తిపన్ను వసూలు చేయడమే లక్ష్యంగా కార్పొరేషన్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఇప్పడున్న బిల్ కలెక్టర్లతో పాటు అన్ని విభాగాల్లోని సిబ్బంది, అధికారులు పన్ను వసూళ్లకోసం ఉపయోగిస్తున్నారు. ఏరోజుకారోజు వసూళ్ల పురోగతిని సమీక్షిస్తున్నారు.

### మొండి బకాయిదారుని దుకాణానికి తాళం

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తిపన్ను మొండి బకాయిదారుల పట్ల అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేసిన అధికారులు వాటికి స్పందించని యజమానుల ఆస్తులను జప్తుచేసేందుకు పూనుకున్నారు. గురువారం పట్టణంలోని శ్రీనివాస టాకీసు ఏరియాకు చెందిన దూలం గురువయ్యకు చెందిన దుకాణానికి సిబ్బంది తాళం వేశారు. 2016 నుంచి ఇప్పటి వరకు ఆస్తి పన్ను మొత్తం కలిపి రూ. 46104 చెల్లించాలని రెడ్ నోటీసు జారీ చేసినా, యజమాని స్పందించకపోవడంతో కమిషనర్ శివాజీ ఆదేశాల మేరకు మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్, బిల్ కలెక్టర్లు, సిబ్బంది కలిసి వెళ్లి దుకాణానికి తాళం వేశారు. మరికొందరికి నోటీసులు ఇచ్చారు.

### పన్నులు చెల్లించి సహకరించాలి



*మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని భవన యజమానులు సకాలంలో ఆస్తిపన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి. మార్చి 31లోగా ఆస్తిపన్నులు చెల్లించాలి. అన్ని వార్డుల్లో తమ సిబ్బంది పన్నులు వసూలు చేస్తున్నారు. వారికి చెల్లించవచ్చు. కార్పొరేషన్ కార్యాలయానికి కూడా వచ్చి కౌంటర్‌లో చెల్లించవచ్చు. మొండి బకాయిదారుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. రెడ్ నోటీసులు జారీచేసి వారి ఆస్తులను జప్తు చేయాలని నిర్ణయం తీసుకున్నాం.*

**- తౌటం శివాజీ, కార్పొరేషన్ కమిషనర్**